
> ప్రజల గొంతుక కావాల్సిన కలం.. కాసుల కక్కుర్తికి దాసోహమైతే ఎలా ఉంటుందో జన్నారం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుని తీరు చూస్తుంటే అర్థమవుతోంది. బాధితులకు అండగా ఉండాల్సింది పోయి, వారి బలహీనతల్నే పెట్టుబడిగా మార్చుకొని సాగిస్తున్న అక్రమ వసూళ్ల దందాను 'జనం పవర్' పత్రిక బట్టబయలు చేస్తోంది. ఉత్తర తెలంగాణ బ్యూరో చీఫ్ తుడుం జితేందర్ ఆధ్వర్యంలో వస్తున్న వరుస కథనాలతో మండలంలోని అవినీతి తిమింగలాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

**తుడుం జితేందర్**
జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో



# జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడి వసూళ్లపై

# సమరం!

- ప్రజల గొంతుక కావాల్సిన కలం కాసుల కక్కుర్తికి దాసోహం
- వార్త రావాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని డిమాండ్
- బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు

## అంబేద్కర్ విగ్రహం సాక్షిగా బహిరంగ సవాల్ విసిరిన తుడుం జితేందర్

## అక్షరం ఆగదు.. అవినీతి వీడదు!

అమాయక ప్రజల ఆవేదనను పెట్టుబడిగా మార్చుకున్న వారెవరైనా సరే చట్టం ముందు నిలబెట్టి తీరుతామని జితేందర్ హెచ్చరించారు. అక్రమార్కుల బెదిరింపులకు భయపడేది లేదని, సాక్ష్యాధారాలతో మరింత దూకుడుగా కథనాలు వస్తాయని స్పష్టం చేశారు. జన్నారం మండలంలో ఈ 'ప్రెస్ క్లబ్ వర్సెస్ జనం పవర్' పోరు ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.





## వార్త కావాలంటే.. వసూలు ఇవ్వాల్సిందే!

జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరసయ్య నాయకత్వంలో మరో ఐదుగురు వ్యక్తులు కలిసి సాగిస్తున్న ఈ 'వార్తా దందా' ఇప్పుడు మండలంలో హాట్ టాపిక్ గా మారింది. వీరు అనుసరిస్తున్న తీరు జర్నలిజం విలువలకే మచ్చ తెచ్చేలా ఉందని బాధితులు వాపోతున్నారు. ప్రజలు తమ సమస్యలపై ధర్నాలు చేసినా, ర్యాలీలు తీసినా అవి పేపర్లో రావాలంటే సదరు సంఘాల నాయకులు ముందే డబ్బులు ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రజా ప్రతినిధులు, చిరుద్యోగుల పొరపాట్లను సాకుగా చూపి.. ఆ వార్తలు రాయకుండా అడ్డుకోవడానికి వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత వారం రోజులుగా వస్తున్న కథనాలతో ధైర్యం తెచ్చుకున్న బాధితులు ఒక్కొక్కరుగా ముందుకు వచ్చి తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు.

## అంబేద్కర్ సాక్షిగా సవాల్.. కవ్వాల్ చౌరస్తాలో తేల్చుకుందాం!

జనం పవర్ కథనాలతో ఉలిక్కిపడ్డ ప్రెస్ క్లబ్ నాయకులు, తప్పుడు ఆరోపణలు చేస్తూ కథనాలను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. దీనిపై తుడుం జితేందర్ తీవ్రంగా స్పందించారు. ఆయన నేరుగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడికి బహిరంగ సవాల్ విసిరారు. "నేను రాస్తున్న ప్రతి అక్షరం నిజం. నా దగ్గర పక్కా సాక్ష్యాధారాలు ఉన్నాయి. ఒకవేళ నా కథనాలు అబద్ధమని మీరు నిరూపించగలిగితే, జన్నారం మండలంలోని కవ్వాల్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం సాక్షిగా నేను బహిరంగ క్షమాపణ చెబుతాను. అంతేకాకుండా జనం పవర్ పత్రిక నుండి తక్షణమే తప్పుకుంటాను. మరి మీ అక్రమాలు నిజం కాదని నిరూపించుకోవడానికి మీరు సిద్ధమేనా?" అని సవాల్ చేశారు.




## చట్టపరమైన చర్యలకు డిమాండ్

జర్నలిజం పేరుతో జరుగుతున్న ఈ దోపిడీపై మండల ప్రజలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్రికా రంగాన్ని అడ్డం పెట్టుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి, విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రెస్ క్లబ్ ముసుగులో సాగుతున్న అక్రమ వసూళ్లపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని, బాధితుల దగ్గర నుండి వసూలు చేసిన సొమ్మును తిరిగి ఇప్పించడంతో పాటు జర్నలిజం పవిత్రతను కాపాడేలా నకిలీ విలేకరులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు పట్టుబడుతున్నారు.

# విగ్రహం 'నమూనా'.. అభివృద్ధికి 'తప్పుడు' చిరునామా?

**గాంధీ విగ్రహం కోసం పేదల ఇళ్ల కూల్చివేతపై వెల్లువెత్తుతున్న నిరసన**

**జనం కోసం ఖర్చు చేయాల్సిన నిధులు.. జడ పదార్థాల కోసమా? ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్న చైతన్యవంతమైన పౌరులు**

**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

అభివృద్ధి అంటే రంగులద్దిన రాతి విగ్రహాలా? లేక సామాన్యుడి కళ్లలో కనిపించే ఆనందమా? నేడు రాజకీయ నాయకులు 'అభివృద్ధి' అనే పదానికి కొత్త అర్థాలు వెతుకుతున్నారు. ముఖ్యంగా మహాత్మా గాంధీ వంటి మహనీయుల పేరు చెప్పి, ప్రజల కడుపు కొట్టి విగ్రహాలు ప్రతిష్టించడంపై ఇప్పుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. తాజాగా ఒక నియోజకవర్గంలో ఎంపీ గారు ప్రతిపాదించిన గాంధీ విగ్రహ ఏర్పాటు నిర్ణయం, స్థానిక ప్రజల ఆగ్రహానికి కారణమవుతోంది.

### ఆశయం మరణిస్తోంది.. ఆకారం పెరుగుతోంది!

మహాత్మా గాంధీ తన జీవితాంతం గ్రా స్వరాజ్యం, పేదల అభ్యున్నతి కోసం పోరాడారు. కానీ నేటి పాలకులు ఆయన ఆశయాలను సమాధి చేసి, ఆకృతులకు ప్రాణం పోయాలని చూస్తున్నారు. విగ్రహం పెట్టడం తప్పు కాదు, కానీ అది ఎవరి గూడును కూల్చి పెడుతున్నారు? ఎవరి కన్నీటిపై ఆ విగ్రహం నిలబడుతోంది? అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న.

### ప్రజల డిమాండ్లు ఇవే



**వైద్యం - ఆయువుపట్టు:** కోట్లు ఖర్చు చేసి విగ్రహం పెట్టే బదులు, అదే ఖర్చుతో ఒక ఆధునిక ఆసుపత్రి కట్టండి. దానికి 'గాంధీ మెమోరియల్ హాస్పిటల్' అని పేరు పెట్టండి. వేలాది మంది పేదలకు ఉచిత వైద్యం అందితే, ఆ దీవెనల్లోనే గాంధీ గారు కనిపిస్తారు.

విద్య – విజ్ఞాన భాండాగారం: భావి భారత పౌరులను తీర్చిదిద్దే స్కూళ్లు, కాలేజీలు నిర్మించి గాంధీ గారి పేరు పెట్టండి. అక్షరజ్ఞానం అందని పేద బిడ్డలకు విద్యాదానం చేయడం కంటే గొప్ప గౌరవం ఏముంటుంది?

**గూడు - నిరుపేద కల:** ఉన్న ఇళ్లను కూల్చడం కాదు.. ఇళ్లు లేని పేదవారికి పక్కా గృహాలు నిర్మించి, ఆ కాలనీకి 'గాంధీ కాలనీ' అని నామకరణం చేయండి. అప్పుడు ప్రజలు మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటారు.

### పరిహారం ఇస్తే ఇల్లు అవుతుందా?

ప్రజలు నివసిస్తున్న ఇళ్లను కూల్చివేసి, కొంత నగదును చేతిలో పెట్టి 'పరిహారం' ఇచ్చాం కదా అని పాలకులు విర్రవీగుతున్నారు. కానీ, ఒక ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదు.. అది ఒక జీవితకాలపు జ్ఞాపకం, ఒక భద్రత. ఆ భద్రతను విచ్ఛిన్నం చేసి గాంధీ విగ్రహం పెట్టడం, ఆ మహనీయుడి సిద్ధాంతాలకే విరుద్ధమని సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు.

"డబ్బు ఇచ్చి పేదవాడి సొంతింటిని దూరం చేయడం అభివృద్ధి అనిపించుకోదు. అది అణచివేత అవుతుంది. ప్రజల అవసరాలను తీర్చని ఏ విగ్రహం కూడా ప్రజల గౌరవాన్ని పొందలేదు."

### కావాల్సింది భవనాలు.. బొమ్మలు కాదు!

ఎంపీ గారు పునరాలోచించుకోవాలి. విగ్రహాల ఏర్పాటు అనేది కేవలం ఎన్నికల ప్రచారానికో, ఫోటోలకో పనికొస్తుంది. కానీ విద్య, వైద్యం, నివాసం వంటి మౌలిక సదుపాయాలు తరతరాల ప్రజల జీవితాలను మారుస్తాయి. ఇప్పటికైనా పాలకులు తమ ప్రాధాన్యతలను మార్చుకోవాలని, 'నిశ్శబ్ద విగ్రహాల' కంటే 'చైతన్యవంతమైన సమాజం' వైపు అడుగులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# మల్కాపూర్ లో స్మశాన వాటిక కబ్జా

- రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలు
- ప్రకాష్ గ్రూప్ వెంచర్ కోసం శ్మశాన భూమిలో రోడ్డు నిర్మాణం
- కాంపౌండ్ వాల్ తో దారులు మూసివేత.. ప్రజల ఇబ్బందులు
- ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన బాధితులు



**సంగారెడ్డి, ఫిబ్రవరి 23 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న మల్కాపూర్ గ్రామంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. లాభార్జనే ధ్యేయంగా స్మశాన వాటిక భూమిని సైతం కబ్జా చేసి సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు. కొండాపూర్ మండలం మల్కాపూర్ లోని సర్వే నంబరు 101/2లో ఉన్న రెండు ఎకరాల స్మశాన వాటిక భూమిని ప్రకాష్ గ్రూప్ ప్రతినిధులు ఆక్రమించి.. తమ వెంచర్ కోసం రోడ్డు వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### దారులు మూసివేసి బెదిరింపులు

స్మశాన వాటిక భూమిలో అక్రమంగా రోడ్డు వేయడం వల్ల ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి కూడా దారి లేని పరిస్థితి ఏర్పడింది. గౌడ, పద్మశాలి కులస్తులు స్మశాన వాటికలోకి వెళ్లకుండా అడ్డుగా కాంపౌండ్ వాల్ నిర్మించి గేటు పెట్టారని మల్కాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ మండిపడ్డారు. ప్రభుత్వ భూమిని రోడ్డుగా ఎలా మారుస్తారని ప్రశ్నిస్తే.. "మీకు దిక్కున్న చోట చెప్పుకోండి" అంటూ వ్యాపారులు బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### విచారణకు ఆదేశం

ఈ అక్రమాలపై కొండాపూర్ తహశీల్దార్ అశోక్ కు గతంలోనే ఫిర్యాదు చేసినా.. ఇప్పటివరకు సర్వే చేయించి భూమిని కాపాడలేదని స్థానికులు విమర్శించారు. దీంతో సోమవారం జిల్లా కలెక్టరేట్ లో జరిగిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. పూర్తిస్థాయి విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామంలోని డంపింగ్ యార్డ్ భూమిని సైతం కబ్జా చేసి గోడ నిర్మించినా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ పట్టించుకోవడం లేదని ప్రభాకర్ గౌడ్ ఆరోపించారు. ప్రభుత్వ భూములను కాపాడి.. అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ లో మేనూర్ విద్యార్థి ప్రతిభ

- ఫిజికల్ సైన్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన శ్రేయస్
- జిల్లా విద్యాధికారి రాజు చేతుల మీదుగా బహుమతి ప్రధానం
- విద్యార్థిని అభినందించిన పాఠశాల బృందం

**జుక్కల్, ఫిబ్రవరి 23 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో మద్నూర్ మండలంలోని మేనూర్ తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచాడు. ఈ పాఠశాలలో చదువుతున్న కె. శ్రేయస్ (తండ్రి శ్రీనివాస్) జిల్లా స్థాయి విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. సోమవారం కామారెడ్డి జిల్లా విద్యాధికారి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రేయస్ కు ప్రథమ బహుమతిని అందజేశారు. ఈ పోటీలకు వి. అనిల్ కుమార్ సలహాదారుగా వ్యవహరించారు. సైన్స్ విభాగంలో పట్టు సాధించి జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్న శ్రేయస్ ను పాఠశాల ప్రధానాచార్యులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇలాంటి పోటీల్లో రాణించడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రతాపరెడ్డి, సిద్ధిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జోనల్ కోఆర్డినేటర్ గా వద్లూరి కృష్ణ నియామకం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జిగా కీలక బాధ్యతలు**

**ఏఐసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన కృష్ణ**



Phone : 23315652

ALL INDIA CONGRESS COMMITTEE
Rajiv Gandhi Panchayat Raj Sangathan
5, Raisina Road, New Delhi - 110004

Dr. Sunil Panwar
Chairperson

| INCHARGES NAME | ZONE |
|---|---|
| MOTHKURI NAVEENKUMAR GOUD | ADILABAD |
| MADDI CHANDRAKANTH REDDY | NIZAMABAD |
| VADLURI KRISHNA | KARIMNAGAR |
| JYOTHSNA NAIK BANOTH | KHAMMAM |
| CHATHRU NAIK | MAHABOOBNAGAR |
| RADAM BHARATH KUMAR | WARANGAL |
| GIRI KONDAL REDDY | MEDAK |

Dr. Sunil Panwar
Chairman RGPRS



**కరీంనగర్, ఫిబ్రవరి 23 (జనం పవర్):**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏఐసీసీ రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన స్టేట్ జోనల్ కోఆర్డినేటర్ గా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జిగా వద్లూరు కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వద్లూరి కృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుతం తాను కరీంనగర్ జిల్లా లీగల్ సెల్ వైస్ చైర్మన్ గా కొనసాగుతున్నానని తెలిపారు. తనకు ఈ కీలక బాధ్యతలు అప్పగించి, తనపై నమ్మకం ఉంచిన జాతీయ రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన చైర్ పర్సన్ సునీల్ పవర్ తో పాటు కిరణ్ కు ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి సుభాష్ యాకర్, రాష్ట్ర రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన చైర్మన్ సిద్ధేశ్వర్ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు ప్రకటించారు. పార్టీ బలోపేతానికి, పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# బసవ డైరీఉ2026 ఆవిష్కరణ

**హరీష్ రావు, చింతా ప్రభాకర్ కు అందజేత**

**విశ్వ లింగాయత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డైరీ రూపకల్పన**

**ధార్మిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన కార్యక్రమం**



**సంగారెడ్డి, ఫిబ్రవరి 23 (జనం పవర్):**

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ లను విశ్వ లింగాయత్ ట్రస్ట్ అధినేత పాసారం శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ముద్రించిన 'బసవ డైరీఉ2026'ను వారికి అందజేశారు. వీరశైవ లింగాయత్ సమాజ ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేలా ఈ డైరీని రూపొందించారు. సమాజ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే ఉద్దేశంతో ప్రముఖ నాయకులను కలిసి ఈ డైరీని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బసవ డైరీ రూపకల్పనను ప్రశంసించిన నాయకులు, ఇటువంటి కార్యక్రమాలు యువతలో ధార్మిక చైతన్యాన్ని, సంస్కృతి పట్ల అవగాహనను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట మాజీ మున్సిపల్ చైర్మన్ శివరాజ్ పాటిల్, సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ పెద్దలు చీల మల్లన్న, గౌరవ సలహాదారులు అన్మిశెట్టి జయప్రకాష్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విశ్వ లింగాయత్ ట్రస్ట్ సమాజ సేవలో తన నిరంతర కృషిని మరోసారి చాటుకుంది.

# పసిపాప మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

**కుమ్మెర మల్లన్న జాతర ఘటనపై రజక సంఘం ఆగ్రహం**

**సిద్దిపేటలో భారీ ర్యాలీ.. పాత బస్టాండ్ వద్ద నిరసన**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

నాగర్ కర్నూల్ మండల పరిధిలో జరిగిన కుమ్మెర మల్లన్న జాతర ఘటనపై సిద్దిపేట రజక సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దైవ దర్శనానికి వెళ్లిన రజక కులానికి చెందిన చంద్రకళ కుటుంబంపై దాడి చేసి, పసిపాప మృతికి కారణమైన నిర్వాహకులు తుకారాం రెడ్డితో పాటు బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిద్దిపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, పాత బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. మల్లన్న దర్శనం కోసం వెళ్లిన నిరుపేద కుటుంబంపై అకారణంగా దాడి చేయడం అత్యంత అమానుషమని రజక సంఘం నాయకులు మండిపడ్డారు. ఈ ఘటనలో చిన్నారి ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణమే కేసులు నమోదు చేసి, వారిని అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చిన్నారుల మృతికి కారణమైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాజంలో వెనుకబడిన వర్గాలపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు దుర్గయ్య, భూంపల్లి శ్రీహరి, భూంపల్లి కనకరాజు, భూంపల్లి లింగస్వామి, భూంపల్లి శ్రీనివాస్, భూంపల్లి వైకుంఠం, కోడూరి నరేష్, నారాయణరావుపేట శ్రీనివాస్, చెవిటి యాదగిరి, చెవిటి శ్యామ్, చెవిటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తులో.. యువత చిత్తు!

> నేటి సమాజంలో యువత చిత్ర విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. పనిపాట లేదు.. చదువుకున్న చదువుకు జీవనోపాధి రాదు.. నైపుణ్యత సాధించలేదు.. ఊరు వదిలి వెళ్ళే ప్రసక్తి లేదు.. మరి ఏం చేయాలి.. రాత్రి అయితే నిరుద్యోగ సంఘంగా నలుగురైదుగురు ఏర్పడి చందాగా డబ్బులు జమ చేసుకొని బారుషాపులు, వైన్ షాపులు, బెల్టు షాపుల మీద పడి ఎక్కే దాకా తాగాలి.. దిగేదాకా ఆగాలి.. మధ్యలో ఉన్న నిషా మత్తులో బజార్లో తాము కూడా సమాజంలో ఉన్నామని నిరూపించుకునేందుకు బైకుల మీద సర్కస్ ఫీట్లు.. సిగరెట్లు.. ప్రభుత్వ నిషేధిత గుట్కాలు.. పాన్ పరాగ్ లు నము లుతూ రోడ్డు మీద ఉమ్మి వేస్తూ షికారులు చేస్తున్నారు.. తల్లి దండ్రులు ప్రేక్షక పాత్ర పోషిస్తూ ఊరు కుంటున్నారు.. పోలీసులు మాత్రం పట్టించు కోకుండా ఉండిపోవడంతో దారి గుండా వెళ్లే యువతులు, మహి ళలు ఎంతో అసౌకర్యానికి గురవు తున్నారు.. వివరాల్లోకి వెళితే..
>
> **సంగారెడ్డి-జనం పవర్**

- "రాత్రయితే మద్యం మత్తులో యువత
- నిషా మత్తుల్లో బజార్లో సర్కస్ ఫీట్లు
- మహిళలు, యువతులకు అనేక ఇబ్బందులు
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న తల్లిదండ్రులు
- పోలీసులు లాఠీ ఝళిపించాలంటున్న ప్రజలు



సంగారెడ్డి జిల్లా మండల, పట్టణంలోని యువత రాత్రయితే మద్య మత్తులో తిరుగు తున్నారు. టీనేజీల దగ్గర నుండి మధ్య వయసు ఉన్న యువకుల వాళ్లు కూడా రాత్రయితే బార్ షాపులు, వైన్ షాపులలోకిక్కిరిసిపోతున్నారు. అది సరిపోకపోతే బెల్టుషాపులకు పరుగులు తీస్తూ మద్యం దాహాన్ని తీర్చుకుంటున్నారు. మద్యం ధరలు పెరుగుతున్న సరే వీరు మాత్రం తాగడం ఆపడం లేదంటే ఎంతగా మద్యానికి బానిసలుగా మారిపోయారు అర్థం చేసుకోవచ్చు. ఎంతోమంది కళాకారులు, ప్రొఫెసర్లు, కళాశాలయాజ మాన్యాలు, పోలీసులు, సంఘసేవకులు, కన్న తల్లిదండ్రులు మద్యం, డ్రగ్స్ కు బానిసలై బంగారు భవిష్యత్తును చేజా తూల నాశనం చేసుకోవద్దని ర్యాలీలు, సమావేశాలు, చైతన్య సదస్సులు పెట్టి అవ గాహన కల్పిస్తున్న వీరిలో ఇసు మంతా చైతన్యం కూడా రాకపోవడం

**విచారకరం. రాత్రయితే చాలు మద్యం వైపే అన్ని దారులు.....**

రాత్రి ఎనిమిది గంటలు దాటితే చాలు యువత మద్యం దారి పడుతున్నారు. ప్రతిరోజు ఎలాంటి పని లేకపోయినా ఎంతో కొంత ఇంటి వద్ద నుండి జమ చేసుకొని నలుగురు గా ఏర్పడి చందాలు వేసుకొని వచ్చిన బ్రాండ్ తీసుకుంటూ తాగు తున్నారు. దీనికి తోడు సిగరెట్లు, గుట్కాలు, పాన్ పరాగులను నము లుతూ మరోవైపు బానిసలుగా మారు తున్నారు. ఇంటి నుండి బయటకు వచ్చి మరల ఇంటికి వెళ్లేసరికి యువత అవతారం మారిపోతుంది. మద్యం మత్తులో జోగుతూ రాత్రి అంతా తిరిగి అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో యువకులు ఇంటికి వెళ్లడం దేశ భవి ష్యత్తును ప్రశ్నార్థకంలోకి నెట్టివేస్తుందని మేధావులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు డ్యూటీ చేసేవారి మద్యం సేవించేవారని అది కూడా రిటర్మెంట్ కు దగ్గర్లో ఉన్నవారికే అలవాటుగా ఉండేదని తెలుపుతున్నారు. కానీ నేటి సమాజంలో టీనేజీ రాగానే మద్యం మత్తులో తగుతూ బొర్లుతూ వీధుల వెంట తిరిగి ఇంటికి చేరడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులతో పాటు ఒళ్ళు, ఇల్లు హూనమై పోయేలాగా యువత తీరు భావితరాల సమాజాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తుంది. నిషా మత్తులో సర్కస్ ఫీట్లు మద్యం తాగాక యువత



అపరిచితుడిలా తయారవుతున్నారు. మద్యం మత్తులో బజార్లో బైకుల మీద సర్కస్ ఫీట్లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పందేలు పెట్టుకుంటూ హై స్పీడ్ తో రోడ్డు మీదకు వెళుతూ మహిళలు, యువతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఏమైనా ప్రశ్నిస్తే మంటలో కాళ్లు పడ్డ కోతిలా ఎగురుతూ మీదకు వస్తున్నారు. మద్యం మత్తు ఒక వైపు అవగాహన లేని వయసు మరోవైపు ఉండడంతో పలువురు చూసి చూడనట్లు వదిలి వేస్తున్నారు. కొంతమంది ముక్కుపచ్చలారని యువతపై కేసులు పె ట్టేందుకు ఇష్టం లేక నవ్వుతూ వెళ్ళి పోతున్నారు. తల్లిదండ్రులు, పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తుండడంతో యువ కులు రోజురోజుకు పెడదారి పడు తున్నారు.

**పోలీసులు లాటి ఝళిపిస్తే దారిలోకి యువత వచ్చే అవకాశం....**

పోలీసులు ప్రతి ఏరియాలో గస్తీ నిర్వహించు కుంటూ రాత్రిళ్ళు జులాయిగా మారి మధ్యాహ్నం యువతను నిఘా పెట్టి లాటి ఝళిపిస్తే దారిలోకి వచ్చే అవకాశాలు చాలా ఉన్నాయని సమాజ సేవకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రాత్రి 11 గంటలు దాటాక బార్ షాపులు, వైన్ షాపులు మూసి వేసే విధంగా చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. గల్లి గల్లిలో వెలసిన బెల్ట్ షాపులపై నిగా పె ట్టి వాటిని కూడా తమదైన శైలిలో పోలీ సులు సమాధానం చెబితే సమా జానికి ఎంతో మేలు జరుగుతుందని యువత తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఎలాగో ఇంటి మాట వినని యువకులు పోలీసులు ఝళిపిస్తున్న లాఠీ దెబ్బలకు దారిలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు





# రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. ధైర్యంగా ఉండండి

- హరీష్ రావు
- మున్సిపల్ ఎన్నికల విజేతలు, అభ్యర్థులకు ఘన సన్మానం
- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భేటీ
- అధికార పార్టీ కుట్రలను ఎండగట్టిన మాజీ మంత్రి

**సంగారెడ్డి, ఫిబ్రవరి 23 (జనం పవర్):**

రాబోయేది మన ప్రభుత్వమేనని, కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు స్పష్టం చేశారు. సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసిన వారితో పాటు గట్టి పోటీ ఇచ్చి ఓడిన అభ్యర్థులు సోమవారం హైదరాబాద్‌లోని హరీష్ రావు నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో హరీష్ రావు అందరినీ శాలువాలతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అద్భుత విజయం సాధించడం పట్ల హరీష్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. అధికార పార్టీ అండతో కొందరు ఎన్ని కుట్రలు చేసినా, ప్రలోభాలకు గురిచేసినా బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రజల మద్దతుతో ధైర్యంగా నిలబడ్డారని గుర్తు చేశారు. కొన్ని చోట్ల అత్యల్ప మెజారిటీతో ఓటమి చెందినప్పటికీ, అభ్యర్థుల పోరాట స్ఫూర్తి అమోఘమని కొనియాడారు. గెలిచిన కౌన్సిలర్లను అభినందించడంతో పాటు, పోరాడి ఓడిన వారిని కూడా హరీష్ రావు పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల అలుపెరగని కృషితో రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి, సదాశివపేట కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సామాజిక విప్లవానికి గురు రవి దాస్ బోధనలే బాటలు

**సంగారెడ్డిలో ఘనంగా 649వ జయంతి వేడుకలు**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 23 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సంత్ గురు రవి దాస్ మహారాజ్ 649వ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గురు రవి దాస్ మహారాజ్ కు ఘన నివాళులు అర్పించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షులు డాక్టర్ కూన వేణు గోపాల కృష్ణ, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంత్ గురు రవి దాస్ మహారాజ్ జీవితం, ఆయన బోధనలు నేటి సమాజానికి ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. గురు రవి దాస్ మహారాజ్ తన ఆధ్యాత్మిక బోధనలు, కీర్తనలు, భజనల ద్వారా కులవ్యవస్థ, సామాజిక వివక్ష, అసమానతలపై గట్టిగా ప్రశ్నించారని వక్తలు కొనియాడారు. సమానత్వం, మానవ గౌరవం, సోదరభావం అనే విలువలను ప్రజల్లో నాటే ప్రయత్నం చేశారని తెలిపారు. ఆయన బోధనలు కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా, సామాజిక చైతన్యాన్ని రగిలించిన ఒక ఉద్యమంగా నిలిచాయని వివరించారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంచడంలో, సమాజంలో సమాన హక్కుల కోసం పోరాటానికి ఆయన రచనలు నిరంతరం ప్రేరణగా నిలుస్తాయని వక్తలు అన్నారు. భక్తి ఉద్యమం ద్వారా ఆయన చేసిన కృషి ప్రజలను ఒకే తాటిపైకి తీసుకువచ్చిందని ప్రశంసించారు. యువత గురు రవి దాస్ మహారాజ్ ఆలోచనలను అవగాహన చేసుకుని, ఆయన చూపిన మార్గంలో సమాజంలో సమానత్వం, న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంత్ గురు రవి దాస్ మహారాజ్ జయంతి వేడుకలు సమాజానికి ఒక కొత్త ఆలోచనా దిశను చూపే విధంగా సాగాయి.



# అక్రమార్కులకు ఉప సర్పంచ్ - సర్పంచ్ అండదండలు?

## మల్కాపూర్ గ్రామపంచాయతీలో ఆరోపణలు



**కొండాపూర్ - జనం పవర్**

మల్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లు అక్రమ కార్యకలాపాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్వయంగా ఒక జర్నలిస్టుకు సంబంధించిన ప్లాట్ విషయంలో అది లీగల్‌గా ఉన్నప్పటికీ, పక్కవాళ్లు ఫిర్యాదు చేశారనే కారణంతో పనులను అకస్మాత్తుగా నిలిపివేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌ల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు అంటున్నారు. "మొత్తం మల్కాపూర్ గ్రామంలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది" అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామపంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి సంబంధిత డాక్యుమెంట్లు కూడా సమర్పించినప్పటికీ, సదరు వ్యక్తి నుంచి అవసరమైన పత్రాలు అందడం లేదని తెలుస్తోంది. దీనిపై ప్రశ్నిస్తే "చూస్తాం, చేద్దాం, మాట్లాడదాం" అంటూ స్పష్టత లేని సమాధానాలు ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్పందించి తగిన విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# షాంపూర్ వాగులో పడ్డ ఆర్టీసీ బస్సు

- షాంపూర్ సమీపంలో తెల్లవారుజామున పెను ప్రమాదం
- అద్దాలు పగులగొట్టి ప్రయాణికులను కాపాడిన గ్రామస్థులు
- క్షతగాత్రులకు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స

**జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

ప్రశాంతంగా సాగుతున్న ఆ ప్రయాణం ఒక్కసారిగా మృత్యువుతో చెలగాటమాడింది. సోమవారం తెల్లవారుజామున ఉట్నూర్ మండలంలోని షాంపూర్ వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అదుపుతప్పిన బస్సు రోడ్డు పక్కనే ఉన్న వాగులోకి దూసుకుపోవడంతో ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. తెల్లవారుజామున మంచు దుప్పటిని చీల్చుకుంటూ వెళ్తున్న బస్సు, షాంపూర్ సమీపానికి రాగానే ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయింది. డ్రైవర్ బ్రేకులు వేయడానికి ప్రయత్నించినప్పటికీ, భారీ శబ్దంతో బస్సు వాగులోకి పల్టీ కొట్టింది. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే బస్సు నీటి అంచున చెల్లాచెదురుగా పడిపోయింది.

### మానవత్వానికి నిలువుటద్దం..

### గ్రామస్థుల సాహసం

ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని గ్రామస్థులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సు అద్దాలను రాళ్లతో పగులగొట్టి, లోపల ఆర్తనాదాలు చేస్తున్న ప్రయాణికులను ఒక్కొక్కరిగా బయటకు తీశారు. స్థానికుల ఈ సమయస్ఫూర్తి అనేక ప్రాణాలను కాపాడిందని చెప్పవచ్చు. తీవ్రంగా గాయపడిన వారిని ఒడ్డుకు చేర్చి, 108 సిబ్బందికి సమాచారం అందించారు. సాహసోపేతమైన రక్షణ చర్యలతో ప్రాణనష్టం జరగకుండా అడ్డుకున్న గ్రామస్థులను అందరూ అభినందిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. బస్సులో ఎంతమంది ఉన్నారనే వివరాలను సేకరిస్తున్నారు. ఈ ప్రమాదం వెనుక ప్రధానంగా సాంకేతిక లోపం ఉందా లేక డ్రైవర్ అజాగ్రత్త ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. బస్సు స్టీరింగ్ లేదా బ్రేకులు అకస్మాత్తుగా ఫెయిల్ అయ్యాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు తెల్లవారుజామున కావడంతో డ్రైవర్ నిద్రమత్తులోకి జారడం వల్ల ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలోనూ పోలీసులు వివరాలు అడుగుతున్నారు. ప్రస్తుతం క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయి విచారణ అనంతరం అసలు కారణాలు వెలుగులోకి రానున్నాయి.



# సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ క్రీడలు షురూ

- ప్రారంభించిన కమిషనర్ రష్మీ పెరుమాళ్ళ
- రాష్ట్ర స్థాయి పోటీల్లో 12 పతకాలతో సత్తా చాటిన పోలీసులు
- బెట్టింగ్ యాప్ ల జోలికి వెళ్లొద్దని సిబ్బందికి హితవు
- శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు అత్యంత ఆవశ్యకం



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ కమీషనరేట్ వార్షిక క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ళ ఈ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించి, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవల జరిగిన నాలుగో తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో సిద్దిపేట పోలీసులు చూపిన అద్భుత ప్రతిభను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 12 పతకాలతో (3 బంగారం, 2 వెండి, 7 కాంస్య) రాష్ట్ర స్థాయిలో కమీషనరేట్ కీర్తిని నిలబెట్టారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో వార్షిక క్రీడల్లోనూ ప్రతి ఒక్కరు తమ ప్రతిభను చాటాలని ఆమె ఆకాంక్షించారు. నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే సిబ్బందికి క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని ఇస్తాయని కమిషనర్ పేర్కొన్నారు. క్రీడలు జట్టు స్ఫూర్తిని పెంపొందించి, పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తాయని చెప్పారు. మైదానంలో ఆడే క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా క్రమశిక్షణను పెంపొందిస్తాయని వివరించారు. ఇదే సమయంలో సమయాన్ని వృథా చేస్తూ, ఆర్థికంగా నష్టపరిచే ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ ల జోలికి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని అధికారులకు, సిబ్బందికి హితవు పలికారు. ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్ తో పాటు ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. మైదానమంతా క్రీడాకారుల కోలాహలంతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.



# సిద్దిపేటలో అకస్మాత్తుగా వాన జల్లులు



- తడిసిముద్దైన రోడ్లు
- బస్సు నిలయం వద్ద గొడుగులతో ప్రయాణికుల పరుగులు
- మధ్యాహ్నం ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- ఉక్కపోత నుంచి ప్రజలకు ఊరట

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లాలో సోమవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై నల్లని మబ్బులు కమ్ముకోవడంతో పట్టణమంతా చీకటిమయమైంది. సుమారు నాలుగు గంటల సమయంలో చిరుజల్లులు కురవడంతో ఒక్కసారిగా జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

### బస్సు నిలయం వద్ద పరుగులు

ముఖ్యంగా సిద్దిపేట బస్సు నిలయం ప్రాంతంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతమంతా గందరగోళంగా మారింది. వర్షం ప్రారంభం కాగానే పాదచారులు, విద్యార్థినులు తమ వద్ద ఉన్న గొడుగులను తీసి పరుగులు తీశారు. తడిసిపోకుండా ఉండేందుకు కొందరు బస్సు నిలయం లోపలికి చేరుకోగా, మరికొందరు షాపుల కింద ఆశ్రయం పొందారు.

### ఉక్కపోత నుంచి ఊరట

రోడ్లన్నీ తడిసిపోవడంతో వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. సాయంత్రం వేళ రద్దీ సమయంలో ఈ వర్షం కురవడంతో కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లేవారు, పనుల మీద బయటకు వచ్చిన వారు కొంత ఇబ్బంది పడ్డారు. అయితే గత కొన్ని రోజులుగా వేధిస్తున్న ఉక్కపోత నుంచి ఈ వాన జల్లులు ఉపశమనం కలిగించాయని పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# కలెక్టరేట్ వద్ద కన్నీటి ధర్నా

- చంటి పిల్లలతో బీడీ కార్మికుల ఆందోళన
- పింఛన్ పెంపు కోసం సిద్దిపేటలో రోడెక్కిన మహిళా కార్మికులు
- సర్కారు హామీలు నెరవేర్చాలంటూ నినాదాలతో హోరెత్తిన కలెక్టరేట్

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీడీ కార్మికులు చేపట్టిన ధర్నాలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్యంగా పింఛన్ పెంపు అంశంపై ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతూ గంటల తరబడి నిరసన తెలిపారు.

### హక్కుల కోసం పోరాడుతూ..

మిట్టమధ్యాహ్నం సూర్యుడు నిప్పులు చెరుగుతున్నా కార్మికులు వెనక్కి తగ్గలేదు. చంటి పిల్లలను ఒడిలో పట్టుకుని, వారిని ఎండ నుంచి కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతూనే ధర్నాను కొనసాగించారు. ఎండ వేడికి తట్టుకోలేక చిన్నారులు గుక్కపెట్టి ఏడుస్తుంటే.. తల్లులు కన్నీళ్లు తుడుచుకుంటూనే తమ నిరసన గళాన్ని వినిపించారు. కొందరు మహిళలు చెట్ల నీడ కోసం ప్రయత్నించగా, మరికొందరు ఎండలోనే కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దృశ్యాలను చూసిన స్థానికులు సైతం చలించిపోయారు.



### అమలుకాని హామీలపై నిలదీత

గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కార్మికులు డిమాండ్ చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలు, జీవన వ్యయంతో పోలిస్తే ప్రస్తుతం వస్తున్న పింఛన్ ఏమాత్రం సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కంటికి ముసుగు వేసుకుని కార్మికుల కష్టాలను చూడని ప్రభుత్వంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్ పెంచే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అధికారులు స్పందించి తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.



